# స్నేహమంటే ఇదే.. మిత్రుడి కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు

నాడు కలిసి చదువుకున్నారు.. నేడు కష్టంలో పాలుపంచుకున్నారు

అనారోగ్యంతో మరణించిన రజనీకర్ కుటుంబానికి రూ. 21,000 సాయం

మానవత్వాన్ని చాటుకున్న 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలో మానవత్వాన్ని చాటే సంఘటన చోటుచేసుకుంది. తమతో కలిసి చదువుకుని, అకాల మరణం చెందిన ఆత్మీయ మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మిత్రుడి కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సాయంగా నగదును అందజేసి తమ స్నేహబంధం విడదీయరానిదని నిరూపించారు. చదువు ముగిసి ఏళ్లు గడిచినా.. ఆపద సమయంలో మిత్రుడిని మరిచిపోకుండా ఆదుకున్న వీరి ఉదారతపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. రాంపూర్ గ్రామానికి చెందిన గుండా రజనీకర్ మూడు రోజుల కిందట అనారోగ్యంతో మరణించారు. రజనీకర్ 1999–2000 విద్యా సంవత్సరంలో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ పూర్తి చేశారు. ఆ విద్యా సంవత్సరంలో ఆయనతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం రజనీకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ.. మిత్రుడితో ఉన్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న స్నేహితులు తక్షణ సాయం కింద రూ. 21,000 నగదును అందజేశారు. కష్టకాలంలో ఆదుకునే వారే నిజమైన స్నేహితులని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాకూరి శ్రీనివాస్ రెడ్డి, బూరుగు కృష్ణ, అర్శం నవీన్ కుమార్, పరకాల మహేందర్ రెడ్డి, కారంపూరి మల్లేశం పాల్గొన్నారు. వీరితో పాటు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతి రెడ్డి, రాంపూర్ మాజీ సర్పంచ్ అనగోని పరశురాములు గౌడ్ హాజరై కుటుంబానికి భరోసా ఇచ్చారు.

# మంచిర్యాల అదనపు కలెక్టర్ గా శ్రీనివాస్ రావు బాధ్యతల స్వీకరణ

ఆర్డీఓ నుంచి అదనపు కలెక్టర్ గా పూర్తి అదనపు బాధ్యతలు

కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వైనం

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా చంద్రయ్య పదోన్నతి



**మంచిర్యాల, ఫిబ్రవరి 28 (జనం పవర్):**

మంచిర్యాల రాజస్వ మండల అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రావు శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పనిచేసిన చంద్రయ్య పదోన్నతి పొందారు. ఆయన ప్రస్తుతం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే రాజస్వ మండల అధికారిగా ఉన్న శ్రీనివాస్ రావుకు రెవెన్యూ విభాగపు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు పేర్కొన్నారు.

# శివ మార్కండేయ దేవాలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

- ముఖ్య అతిథిగా హాజరైన కల్వకుంట్ల వంశీధరావు
- మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో వేడుకలు
- భారీగా తరలివచ్చిన భక్తులు.. శివనామ స్మరణతో మారుమోగిన ఆలయం





**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట పట్టణంలోని శివ మార్కండేయ దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణ పద్మశాలి యువజన విభాగం, మహిళా విభాగం, 43వ వార్డు పద్మశాలి ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో సాగింది. వేద మంత్రాల నడుమ శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ మహోత్సవానికి కల్వకుంట్ల వంశీధరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పాటు అఖండ పూజలు, గజస్తంభ ప్రతిష్ట, హోమాలు, ప్రత్యేక అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అధ్యక్షులు కాముని రాజేశం, ఉపాధ్యక్షులు పెద్ద అశోక్, కోశాధికారి సూరం ప్రసాద్ పర్యవేక్షించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శివ మార్కండేయ దేవ తాభ్యో నమః, ఓం నమః శివాయ నినాదాలతో సిద్దిపేట పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# శాస్త్రీయ దృక్పథంతోనే కొత్త ఆవిష్కరణలు








- క్రాంతి పాఠశాలలో సైన్స్ డే
- ఆకట్టుకున్న ఊపిరితిత్తుల శ్వాసక్రియ ప్రదర్శన
- విద్యార్థుల్లో వైజ్ఞానిక ఆసక్తి పెరగాలన్న చైర్మన్ భగవాన్ రెడ్డి
- సోలార్, రాకెట్ నమూనాలతో మెరిసిన విద్యార్థులు



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిస్తే అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయని క్రాంతి హై స్కూల్ చైర్మన్ భగవాన్ రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట మైత్రివనంలోని క్రాంతి హై స్కూల్ లో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చైర్మన్ భగవాన్ రెడ్డి, ప్రిన్సిపాల్ కుమారస్వామి పర్యవేక్షణలో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన విజ్ఞాన పరికరాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు రాకెట్ ప్రయోగాన్ని నమూనాగా ప్రదర్శించగా.. సోలార్ శక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని వివరించారు. గాలి నిర్ధారణ విధానంతో పాటు ఊపిరితిత్తుల పనితీరును సులభంగా అర్థమయ్యేలా వివరించారు. సైన్స్ ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు మేక ఊపిరితిత్తుల ద్వారా శ్వాసక్రియ విధానాన్ని ప్రత్యక్షంగా చూపించి ప్రశంసలు పొందారు. గాలి లోపలికి వెళ్లినప్పుడు ఊపిరితిత్తులు ఎలా ఉబ్బుతాయి.. బయటకు వచ్చినప్పుడు ఎలా కుంచించుకుపోతాయో స్పష్టంగా వివరిస్తూ మనుషుల శ్వాసక్రియపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భద్రతా నియమాలు పాటిస్తూ ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. పిల్లల ప్రతిభను అభినందించిన ప్రిన్సిపాల్ కుమారస్వామి మాట్లాడుతూ.. విజ్ఞానం అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాల ద్వారా నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనుశ్రీ, హర్షవర్ధిని విద్యార్థినులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. విద్యార్థుల ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు, అతిథులు అభినందించారు.

# వృక్షాలను దేవతలుగా భావించి కాపాడుకోవాలి

- గొట్టిపర్తి రామస్వామి గౌడ్
- నంగునూరులో పురాతన రావిచెట్టుకు 'మదర్ ట్రీ' హోదా
- బక్రీచెప్యాలలో కోలాహలంగా చెట్టమ్మ వేడుకలు
- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అటవీ శాఖ, విద్యాశాఖ చొరవ

**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

ప్రకృతిని కాపాడితేనే మన ఉనికి ఉంటుందని, వృక్షాలను దేవతలుగా భావించి సంరక్షించుకోవాలని నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి గౌడ్ పిలుపునిచ్చారు. నంగునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న పురాతన రావిచెట్టును శనివారం 'మదర్ ట్రీ' (చెట్టమ్మ)గా ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు.

## ప్రకృతి విధ్వంసంతో ముప్పు

ఈ సందర్భంగా రామస్వామి గౌడ్ మాట్లాడుతూ.. ప్రకృతి విధ్వంసం కారణంగా పర్యావరణ సమస్యలు తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాచీన కాలంలో వృక్షాలను దైవాలుగా భావించడం వల్లే సమాజం సుస్థిరంగా కొనసాగిందని గుర్తుచేశారు. వృక్షాలను కాపాడుకోకపోతే పర్యావరణ సమతుల్యత దెబ్బతిని విపరీత పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్ ఛార్జి ప్రధానోపాధ్యాయుడు దుబ్బుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు గిరి తిరుపతి, వై. రామ గోపాల్ రెడ్డి, జీ. కన్యాలాల్, కొత్తపల్లి రవి, వంశీకృష్ణ, ఎమ్. అనిత, అంబిక, పీ. రాజు, ఏల రాజిరెడ్డి, ఎమ్. నగేశ్, ఎమ్. సుశీల, ఎమ్. గణేశ్, జీ. శశికళ, పోల్సాని సుధాకర్, దాసరి పెంటయ్య, మధుసూదన్ రెడ్డి, పీ. నాగభూషణం పాల్గొన్నారు.

## బక్రీచెప్యాలలో 'చెట్టమ్మ' వేడుకలు






తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ స్ఫూర్తితో సిద్దిపేట అర్బన్ మండలం బక్రీచెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ పురాతన చెట్టును 'మదర్ ట్రీ'గా ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో విద్యార్థులు చెట్టమ్మ వేషధారణలో పాల్గొని అలరించారు. పర్యావరణ పరిరక్షణపై వారు ఇచ్చిన సందేశం అందరినీ ఆలోచింపజేసింది. ఉపాధ్యాయులు మామిడి పూర్ణచంద్రరావు, వర్కోలు లక్ష్మయ్య, సుహాసిని ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు వృక్ష సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంచడమే కాకుండా.. చెట్లను కాపాడేందుకు సమాజం ముందుకు రావాల్సిన అవసరాన్ని చాటిచెప్పాయి.

జనం పవర్
JANAM POWER



మందమర్రి మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. చట్టం కళ్లుగప్పి, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. జైపూర్ మండలం ముదిగుంట వాగు నుంచి పొన్నారం, వెంకటాపూర్ గ్రామాలకు నంబర్ ప్లేట్లు లేని ట్రాక్టర్లు ప్రాణాంతక వేగంతో దూసుకుపోతుండటంతో స్థానికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా సాగుతున్న ఈ దందాపై ఫిర్యాదులు చేసినా రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తుడుం జితేందర్ - జనం పవర్
ఉత్తర తెలంగాణ బ్యూరో




# మందమర్రిలో ఇసుక అక్రమ రవాణా

## అధికారుల కళ్లుగప్పి కాసుల కక్కుర్తి?


మందమర్రి మండలంలో ఇసుక ట్రాక్టర్లు చట్టంతో సంబంధం లేకుండా తమ పని తాము యథేచ్ఛగా కానిచ్చేస్తున్నాయి. జైపూర్ మండలం ముదిగుంట వాగు నుంచి వెంకటాపూర్ (గుడిపల్లి), పొన్నారం గ్రామాలకు సాగుతున్న ఇసుక రవాణా ఇప్పుడు ప్రాణాంతక వేగంతో పరుగులు తీస్తోంది. ఇంత బహిరంగంగా అక్రమ రవాణా సాగుతున్నా అటవీ శాఖ, రెవెన్యూ, స్థానిక పోలీసులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనం అక్రమార్కులకు వరంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### నంబర్ ప్లేట్ లేదు.. భయం అస్సలే లేదు!

పొన్నారం గ్రామానికి ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్ తీరు ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. ఈ ట్రాక్టర్ ఇంజన్ కు నంబర్ ప్లేట్ లేదు. కేవలం ట్రాలీకి మాత్రమే టీఎస్ 19 టీ 2020 అనే నంబర్ ఉంది. నంబర్ ప్లేట్ లేని వాహనాలు రోడ్లపై తిరగడం చట్టరీత్యా నేరమని తెలిసినా ఆ వాహనం పగలు రాత్రి తేడా లేకుండా విచ్చలవిడిగా తిరుగుతోంది. నంబర్ లేని వాహనంతో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని, బాధితులు ఎవరిని పట్టుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ముదిగుంట వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు
- నంబర్ ప్లేట్ లేని వాహనాలతో అతివేగం.. జనం బేజారు
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్, అటవీ అధికారులు




### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

వెంకటాపూర్ గ్రామ వీధుల్లో ఈ ట్రాక్టర్లు వెళ్తుంటే భూమి ప్రకంపిస్తోందని, డ్రైవర్ల అతివేగం చూస్తుంటే రోడ్డుపై నడవాలంటేనే ప్రజలు వణికిపోతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అటవీ మార్గాల ద్వారా సాగుతున్న ఈ రవాణాను అటవీ శాఖ అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై నిఘా పెట్టాల్సిన రెవెన్యూ ఎంఆర్ఓ మౌనంగా ఉండటం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. అతివేగంగా, నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై స్థానిక ఎస్సై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ ప్రాణాలు పోయాక స్పందిస్తారా అంటూ అధికారుల తీరుపై వెంకటాపూర్ గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



# కాకతీయ హైస్కూల్లో బాల శాస్త్రవేత్తల విన్యాసం

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు
- విద్యార్థుల ప్రతిభను అభినందించిన జగ్గు మల్లారెడ్డి
- ఉత్తమ ప్రాజెక్టులకు నగదు బహుమతులు అందజేత

జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు కోలాహలంగా జరిగాయి. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన విజ్ఞాన నమూనాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. బాల శాస్త్రవేత్తలుగా మారిన విద్యార్థులు ఒక్కో ప్రాజెక్టు పనితీరును వివరిస్తుంటే.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి ప్రతిభను చూసి ఆశ్చర్యపోయారు. విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తిని పెంచుతూ, సృజనాత్మకతకు వేదికగా నిలిచిన ఈ వేడుకలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

### శాస్త్రవేత్తలుగా ఎదగాలి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, ఈరోజు వారు రూపొందించిన పరికరాలే రేపటి శాస్త్రవేత్తలుగా వారిని తీర్చిదిద్దుతాయని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే గొప్ప మహానుభావుల అడుగుజాడల్లో నడిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సృజనాత్మకతను వెలికితీసేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల ఆసక్తులను గమనించి వారిని ప్రోత్సహించాలని, మంచి పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.

### ప్రతిభకు గుర్తింపు



వేడుకల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైన్స్ ప్రాజెక్టులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కవిత నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైజ్ఞానిక స్ఫూర్తిని రగిలించేలా సాగిన ఈ ప్రదర్శన విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలకు నాంది పలికింది.






# రైల్వే కూలీలతో జగ్గారెడ్డి ముచ్చట

- ఢిల్లీ నుంచి తిరిగొచ్చిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- అభిమానంతో ఫొటోలు దిగిన కార్మికులు
- సమస్యలు అడిగి తెలుసుకున్న నేత



**సంగారెడ్డి, ఫిబ్రవరి 28 (జనం పవర్):**

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో రైలు దిగిన ఆయనను చూడగానే రైల్వే కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చూడగానే కూలీలు ఉత్సాహంతో ఆయన వద్దకు చేరుకుని గ్రూపు ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి కూలీలతో కాసేపు సరదాగా ముచ్చటించారు. వారి క్షేమ సమాచారంతో పాటు విధుల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. తమతో సామాన్యంగా కలిసిపోయి మాట్లాడిన నాయకుడి తీరు పట్ల కూలీలు సంతోషం వ్యక్తం చేశారు.

# చేవెళ్ల ఆర్డీఓగా పార్థసింహారెడ్డి బాధ్యతల స్వీకరణ

- మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్, నేతలు
- నూతన రాజస్వ మండల అధికారికి ఘన సన్మానం



**చేవెళ్ల, ఫిబ్రవరి 28:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల రాజస్వ మండల అధికారి (ఆర్డీఓ)గా కే పార్థసింహారెడ్డి శనివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతావెంకట్ రెడ్డి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఆర్డీఓను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన నేతృత్వంలో చేవెళ్ల ప్రాంతం మరిన్ని అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, కృష్ణానాయక్, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, నాయకులు అత్తెల్లి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, పాలనలో పారదర్శకతపై అధికారులతో నేతలు కాసేపు చర్చించారు.

